# అంతా అయోమయం – సర్వం జగన్నాథం



"ఏమోయ్ జగన్నాథం! ఈ వార్త విన్నావా?"

"నేనూ ఇప్పుడే విన్నానోయ్ గుర్నాథం. ఇంకా నీకే చెబ్దామని ఇలా వస్తున్నాననుకో."

"అయినా అదసలు అలా జరగడం న్యాయమేనంటావా?"

"ఇందులో న్యాయాన్యాయాల ప్రసక్తేముంది చెప్పు. ఒకళ్ళకి న్యాయమనిపించింది, ఇంకొకళ్ళకి న్యాయం కాకపోవచ్చు కదా! అంతా పరిస్థితుల మీద ఆధారపడి వుంటుంది."

"నాకు మాత్రం చాలా ఆశ్చర్యంగా వుందిస్మీ."

"ఇందులో ఆశ్చర్యపడవలసిందేం లేదోయ్. ఫాక్ట్ ఈజ్ స్ట్రేంజర్ దేన్ ఫిక్షన్ అన్నారు కదా! ఈ సంఘటన కూడా అదే కోవలోకి చెందుతుందనుకో!"

"ఇలాంటివి వింటుంటే భగవంతుడనే వాడున్నాడా అని డౌటొస్తుందోయ్!"

"అబ్బే, మధ్యలో భగవంతుణ్ణి ఎందుకూ అనుకోడం. ఎవరు చేసుకున్న ఖర్మకు వారే బాధ్యులు."

"కాని, ఆ పరిస్థితులలో అలా జరగడం చాలా తప్పేమో అని అనిపించక మానదేం!?"

"అసలిందులో తప్పొప్పుల ప్రసక్తి మాత్రం ఏవుంది చెప్పు. కొందరికి తప్పైనవి మరి కొందరికి ఒప్పుగా తోచవచ్చు. అంతా సమయాన్ని, సందర్భాన్ని బట్టి మారుతూ వుంటుంది. ఆ టైములో మనమున్నా అలాగే చేసే వాళ్ళమేమో!"

"మనం ఈ సందర్భంలో ఏమైనా సహాయపడగలమంటావా?"

"ఇలాంటి విషయాల్లో ఎవరికి మాత్రం ఎవరు సహాయం చెయ్యగలరు? ఒకవేళ ఇప్పుడు సహాయం చేసినా దాన్ని అపార్థం చేసుకునే అవకాశాలు హెచ్చుగా వున్నాయ్!"

"పోనీ కనీసం వెళ్ళి సానుభూతైనా తెలియజేస్తే—?"

"నువ్వన్నట్లు ఆ పని చెయ్యడానికైనా మనకిప్పుడు అవకాశం లేదుకదా! ప్రయత్నించినా లోకం దృష్టిలో చులకనయిపోమా?"

"ఏమీ చెయ్యలేకపోతున్నందుకు బాధగా వుందోయ్!"

"ఏం చేస్తాం చెప్పు. ఈ జీవితంలో ఎన్నో చెయ్యాలనుకుంటాం. చివరికి ఏం చెయ్యలేకపోతాం. జీవితమంటే ఇదే కదా!"

"అయితే ఇక లాభం లేదంటావా?"

"ఇక ఇంత చెప్పినా అర్థం చేసుకోకపోతే మరి నీ ఇష్టం. ఆ తర్వాత ఏం జరిగినా నన్ను అనొద్దు."

"అంతే అంటావా జగన్నాథం."

"అంతే అనుకో గుర్నాథం."

"అయితే మరి వస్తానోయ్ జగన్నాథం."

* * *

'ఈ గుర్నాథంగాడు ఇన్నాళ్ళూ అర్థం పర్థం లేకుండా వాగడంలో తనే గొప్ప అని విర్రవీగేవాడు. ఇన్నాళ్ళకి వాణ్ణి చావుదెబ్బ కొట్టేను. ఇక వస్తే నా జోలికి రాడు' స్వగతంగా అనుకుంటూ ఇంటి దారి పట్టేడు జగన్నాథం.

— సామవేదుల వెంకటరామశాస్త్రి



## దేవుడికే తెలుసు

పరీక్ష హాల్లోకి వెళ్ళాక, ప్రశ్నాపత్రం చూసిన విద్యార్థికి మూర్ఛ వచ్చినంత పనైంది. అందులో అతనికి జవాబు తెలిసిన ప్రశ్న ఒక్కటి కూడా లేదు. "దేవుడికి మాత్రమే ఈ ప్రశ్నలకు జవాబు తెలుసు! మెర్రీ క్రిస్టమస్" అంటూ జవాబు పత్రంపై రాసి ఇచ్చేడు.

సెలవలు అయిపోయిన తరువాత ఉపాధ్యాయుడు ఎవరికి వచ్చిన మార్కులు వాళ్ళకిస్తూ ఆ విద్యార్థికి ఓ కాయితం ఇచ్చాడు. అందులో ఇలా వుంది:

"దేవుడికి 'ఏ' గ్రేడు, నీకు 'ఎఫ్' గ్రేడు వచ్చింది. హేపీ న్యూ ఇయర్."

